సాక్షి పశ్చిమగోదావరి

మంగళవారం । 4 । జూన్ । 2024



ముగిసిన బ్రహ్మోత్సవాలు

జంగారెడ్డిగూడెంలో గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. 8లో ▸



నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణం

మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో హనుమద్ జయంతి వేడుకల్లో భాగంగా ఉపాలయంలో కొలువైన వేంకటేశ్వరస్వామి కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. 8లో ▸



చిత్తడి భూములకు ముప్పు

కొల్లేరు చిత్తడి భూముల పరిరక్షణపై పలు స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ ప్రేమికులు వివిధ రూపాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 8లో ▸

తీర్పు నేడే

కౌంటింగ్‌కు వేళాయే..

- 21 రోజుల ఉత్కంఠకు తెర
- భీమవరంలోని రెండు కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు
- సర్వ సన్నద్ధంగా జిల్లా యంత్రాంగం
- భారీ బందోబస్తు ఏర్పాటు
- తొలి ఫలితం నరసాపురం

సాక్షి, భీమవరం: ఎప్పుడెప్పుడా అంటూ మూడు వారాలుగా అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సమయం వచ్చేసింది. నరాలు తెగే ఉత్కంఠకు మరికొద్ది గంటల్లో తెరపడనుంది. సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యంపై ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓటరు తీర్పు వెలువడనుంది. జిల్లాలోని నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం, ఏడు అసెంబ్లీ స్థానాలకు రెండు కేంద్రాల్లో మంగళవారం కౌంటింగ్ నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది.

మహిళా ఓటర్లు అధికం

గత నెల 13న జిల్లాలోని నరసాపురం పార్లమెంట్, భీమవరం, ఉండి, తణుకు, తాడేపల్లిగూడెం, ఆచంట, పాలకొల్లు, నరసాపురం అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగాయి. ఆయా నియోజకవర్గాల్లోని 1,463 పోలింగ్ కేంద్రాల పరిధిలో 14,72,923 మంది ఓటర్లకు గాను 12,16,667 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. జిల్లా వ్యాప్తంగా పురుషుల కంటే 11,534 మహిళల ఓట్లు అధికంగా పోలయ్యాయి. పోలింగ్ అనంతరం భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల ఈవీఎంలు భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్, నరసాపురం, పాలకొల్లు, తణుకు, ఆచంట నియోజకవర్గాల ఈవీఎంలను విష్ణు కళాశాలలో భద్రపరిచారు. ఈ రెండు కేంద్రాల్లోనే కౌంటింగ్ ఏర్పాట్లుచేశారు. ముందుగా నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్‌లో 13,345, హోం ఓటింగ్‌లో 2,094, సర్వీస్ ఓట్లు 888 కలిపి మొత్తం 16,327 ఓట్లు పోలయ్యాయి.

ఎక్కడ చూసినా అదే చర్చ

పోలింగ్ అనంతరం పట్టణాలు, గ్రామాలు ఎక్కడ చూసినా ఎన్నికల ఫలితాలపైనే చర్చలు కనిపించాయి. పార్లమెంట్, ఏడు అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థుల విజయావకాశాలు, మెజార్టీలు, రాష్ట్రంలోని ముఖ్యనేతల విజయావకాశాలు, రాష్ట్రం, కేంద్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనే అంశాలపై చర్చించుకోవడం కనిపించింది. మూడు వారాల ఉత్కంఠతకు తెరపడనుండటంతో ప్రజలంతా ఎంతో ఆసక్తితో ఉన్నారు.

1,045 మంది సిబ్బంది నియామకం

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం కౌంటింగ్‌కు సర్వం సిద్ధం చేసింది. రెండు కౌంటింగ్ కేంద్రాల్లో ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 14, పక్కనే గల మరో హాల్‌లో పార్లమెంట్ నియోజకవర్గానికి 14 టేబుళ్లు సిద్ధం చేశారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపు కోసం విష్ణు కళాశాలలోని లైబ్రరీ రీడింగ్ రూమ్ గ్రౌండ్ ఫ్లోర్‌లో పార్లమెంట్ నియోజకవర్గానికి 14 టేబుళ్లు, ఈటీపీబీఎస్ ఓట్ల కోసం ఒక టేబుల్ ఏర్పాటుచేశారు. అలాగే ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి నాలుగు టేబుళ్లు, ఈటీపీబీఎస్ ఓట్లను ఆర్‌ఓ టేబుల్‌పైన లెక్కిస్తారు. 265 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 431 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 297 మంది మైక్రో అబ్జర్వర్లు, 52 మంది ఏఆర్‌ఓస్‌లతో కలిపి 1,045 మంది కౌంటింగ్ విధుల్లో పాల్గొంటున్నారు. 20 మంది చీఫ్ ఎలక్షన్ ఏజెంట్స్, రాజకీయ పార్టీల తరపున 147 మంది కౌంటింగ్ ఏజెంట్లు ఓట్ల లెక్కింపులో పాల్గొంటారు.

భద్రత కట్టుదిట్టం

కౌంటింగ్ కేంద్రాల వద్ద కేంద్ర, రాష్ట్ర బలగాలు 1,500 మందితో జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత మూడంచెల భద్రతను ఏర్పాటుచేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్దకు ఇతరుల వాహనాలకు అనుమతి లేకుండా ఆంక్షలు విధించారు. మద్యం సేవించి వచ్చి గలాటాలు సృష్టించకుండా ఉండేందుకు కౌంటింగ్ హాల్‌లోకి ఏజెంట్లు తదితరులకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు చేసి తర్వాత లోపలికి అనుమతించనున్నారు. రిటర్నింగ్ అధికారి మినహా మిగిలిన కౌంటింగ్ సిబ్బంది, రాజకీయ పార్టీల కౌంటింగ్ ఏజెంట్లు ఎవరూ మొబైల్ ఫోన్ తీసుకువెళ్లరాదు. అధికారిక కమ్యూనికేషన్ విభాగంలో ఎస్టీడీ, ఫ్యాక్స్, ప్రింటర్-ఇంటర్నెట్ సౌకర్యంతో పాటు ప్రధాన ఎన్నికల అధికారికి తక్షణ సమాచారం కోసం హైస్పీడ్ ఇంటర్నెట్ కనెక్షన్ ఏర్పాటు చేయించారు. విష్ణు, ఎస్ఆర్‌కేఆర్ కళాశాలల రోడ్డులో మంగళవారం ట్రాఫిక్ ఆంక్షలు అమలుకానున్న నేపథ్యంలో సోమవారం సాయంత్రం ఆయా రోడ్లలో పోలీసులు ట్రయల్‌రన్ నిర్వహించి ట్రాఫిక్ మళ్లించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా అంతటా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలు చేయనున్నారు. అల్లర్లు జరగకుండా ఉండేందుకు కౌంటింగ్ అనంతరం విజయోత్సవాలపై నిషేధం విధించారు.

మొత్తం ఓట్లు	
14,72,923	
పోలైన ఓట్లు	
12,16,667	
పోస్టల్ బ్యాలెట్లు	సర్వీసు ఓట్లు
13,345	888
హోం ఓటింగ్ ఓట్లు	పోలింగ్ కేంద్రాలు
2,094	1,463

కౌంటింగ్ కేంద్రాలు

భీమవరం విష్ణు కళాశాల
ఆచంట, తణుకు, పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాలు

భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాల
భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం నియోజకవర్గాలు



భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపునకు సిద్ధమైన కౌంటింగ్ కేంద్రం



భీమవరంలో ట్రాఫిక్ మళ్లింపుపై పోలీసుల ట్రయల్‌రన్



భీమవరంలో కౌంటింగ్ జరిగే విష్ణు కళాశాల

రెండు గంటల్లోపే నరసాపురం ఫలితం

ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపు మొదలైన అర గంటలోపే ఈవీఎంల కౌంటింగ్ ప్రారంభమవుతుంది. పోస్టల్ బ్యాలెట్ల కన్నా ఈవీఎంల ఫలితాలే ముందు రానున్నాయి. అన్ని సజావుగా సాగితే ఒక్కో రౌండుకు 20 నిమిషాల నుంచి అర గంట సమయం పడుతుంది. ఈ మేరకు తక్కువ పోలింగ్ కేంద్రాలు ఉన్న నరసాపురం నియోజకవర్గ ఫలితం మధ్యాహ్నం 1.30 నుంచి 2 గంటల సమయానికి వెలువడనుంది. మధ్యాహ్నం 2.30 గంటలకు ఆచంట, పాలకొల్లు, 3 గంటలకు తాడేపల్లిగూడెం, తర్వాత భీమవరం, తణుకు, ఉండి ఫలితాలు వస్తాయని అంచనా.

పక్కాగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు

కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం



భీమవరం: పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు సంబంధించి ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా కౌంటింగ్ పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియపై ఏఆర్‌ఓలు, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ సూపర్‌వైజర్లు, మైక్రో అబ్జర్వర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లకు భీమవరం విష్ణు కళాశాల లైబ్రరీ హాల్‌లో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ ద్వారా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు సంబంధించిన అంశాలను క్షుణ్ణంగా తెలుసుకుని మంగళవారం జరిగే కౌంటింగ్‌లో సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలన్నారు. శిక్షణలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది వద్దకు వెళ్లి లెక్కింపునకు సంబంధించిన ప్రశ్నలు అడిగి పలు అంశాలను నివృత్తి చేశారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియలో ఫారం-13 సి, ఫారం-13 ఎ, ఫారం-13 బిలకు సంబంధించిన అంశాలను వివరించి వాటిపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సర్వీస్ ఓటర్లకు సంబంధించి బ్యాలెట్ల లెక్కింపులో పూర్తి జాగ్రత్త వహించి మార్గదర్శకాలకు అనుగుణంగా లెక్కింపును విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. ఎలాంటి సొంత ఆలోచనలకు తావివ్వకుండా ఎన్నికల నిబంధనలను విధిగా పాటించాలన్నారు. డీఆర్వో జె.ఉదయభాస్కరరావు, ఎన్నికల సెక్షన్ పర్యవేక్షకుడు చందన దుర్గాప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.

విజయోత్సవాల్లేవ్..

- వేడుకలు, ర్యాలీలపై నిషేధం
- జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్
- 6 వరకు ఎన్నికల కోడ్ అమలు
- పోలీస్ యంత్రాంగం అప్రమత్తం

సాక్షి, భీమవరం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పోలీస్ యంత్రాంగం అప్రత్తమైంది. జిల్లాలో ఎక్కడా అల్లర్లు, హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టింది. ఈనెల 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ఎన్నికల్లో గెలుపొందిన వారు విజయోత్సవాలు నిర్వహించుకునేందుకు మూడు రోజులు ఆగాల్సిందే.

ఇంటెలిజెన్స్ సమాచారంతో..

ఓట్ల లెక్కింపు సందర్భంగా అల్లర్లు జరిగేందుకు ఆస్కారమున్నట్టు ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం మేరకు జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత భద్రతా చర్యలు చేపట్టారు. జిల్లావ్యాప్తంగా రాష్ట్ర పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలు, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్సులు, రాపిడ్ యాక్షన్ ఫోర్సులతో బందోబస్తు ఏర్పాటుచేశారు. సమస్యాత్మకంగా గుర్తించిన 137 గ్రామాల్లో పోలీస్ పికెటింగ్ కొనసాగిస్తున్నారు. తరచూ గొడవలు పడే 6 వేల మందిని గుర్తించి బైండోవర్ చేశారు. పెట్రోల్ బాంబులు, పేలుడు స్వభావం కలిగిన బాణసంచా సామగ్రితో అల్లర్లు సృష్టించేందుకు ఆస్కారముండటంతో పెట్రోల్, డీజిల్‌ను బాటిళ్లలో లూజ్ విక్రయాలు చేయకుండా కొద్ది రోజులుగా నిషేధం విధించారు. బాణసంచా విక్రయాలపైనా ఆంక్షలు విధిస్తూ తయారీదారులకు ఆదేశాలిచ్చారు.



భీమవరంలో కౌంటింగ్ విధులకు హాజరైన పోలీసు బలగాలు

కౌంటింగ్ విజయవంతమే లక్ష్యం



ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, గొడవలు, అల్లర్లు జరగకుండా కౌంటింగ్‌ను విజయవంతం చేయడమే మా లక్ష్యం. జిల్లాలో శాంతిభద్రతలకు భంగం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నాం. కౌంటింగ్ అనంతరం ఎటువంటి ఉత్సవాలకు, ర్యాలీలకు, బాణాసంచా పేల్చడం, సభలు నిర్వహించడానికి వీలులేదు. ప్రజలు సంయమనం పాటించి పోలీసులకు సహకరించాలని కోరుతున్నాం.

– డాక్టర్ అజిత, జిల్లా ఎస్పీ

మరో మూడు రోజుల పాటు..


ఈనెల 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో కౌంటింగ్ అనంతరం మూడు రోజుల పాటు విజయోత్సవాలపై నిషేధం విధించారు. జిల్లా అంతటా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉండటంతో ఎటువంటి ఊరేగింపులు, ర్యాలీలు చేయకూడదని, బాణసంచా కాల్చరాదని, ఎవరూ గుంపులుగా ఉండకూడదని పోలీసులు హెచ్చరిస్తున్నారు. అల్లర్లలో పాల్గొనే వారి వాహనాలు సైతం సీజ్ చేస్తామని, అల్లర్లకు ఉసిగొల్పే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామంటున్నారు.

సోషల్ మీడియాపైనా నిఘా

కొందరు విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు షేర్ చేస్తుండటంతో సోషల్ మీడియాపైనా పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా పెట్టింది. సైబర్ క్రైమ్‌కు సంబంధించిన పోలీస్ అధికారులు సోషల్ మీడియాలో వస్తున్న పోస్టులను పరిశీలిస్తున్నారు. సామాజిక మాధ్యమాల వేదికగా రాజకీయ పార్టీల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా మాట్లాడి వీడియోలు, ఆడియోలు పోస్టు చేసి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

భీమవరం: భీమవరంలోని విష్ణు, ఎస్ఆర్‌కేఆర్ కళాశాలల్లోని కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు జరుగనున్న నేపథ్యంలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఆయా కేంద్రాలకు వెళ్లే భీమవరం-గరగపర్రు, భీమవరం-జువ్వలపాలెం రోడ్లలో ట్రాఫిక్ మళ్లింపు, కౌంటింగ్‌కు హాజరయ్యే అధికారులు, సిబ్బంది, పోటీలో ఉన్న అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్ల వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు. రెండు కేంద్రాల వద్ద రాష్ట్ర పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలు, స్పెషల్ ప్రొటెక్షన్‌ఫోర్స్, రాపిడ్ యాక్షన్ ఫోర్సు దాదాపు 1,500 మంది విధుల్లో ఉంటారని ఎస్పీ వేజెండ్ల అజిత చెప్పారు. మంగళవారం భీమవరంలో వ్యాపార సంస్థలు, దుకాణాలు మూసివేయాలని పోలీసు శాఖ కోరింది. కౌంటింగ్ కేంద్రాలకు మూడు కిలోమీటర్ల పరిధిలో రెడ్‌జోన్, నో ఫ్లై జోన్‌గా ప్రకటించారు.



కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు

భద్రతా ఏర్పాట్ల పరిశీలన

భీమవరం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో సోమవారం భీమవరం ఎస్ఆర్‌కేఆర్, విష్ణు కళాశాలల్లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ సుమిత్‌కుమార్, జిల్లా ఎస్పీ అజిత పరిశీలించారు. పోలీసు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. పార్టీ అభ్యర్థులు, ఏజెంట్లను పక్కాగా తనిఖీ చేసి కేంద్రాల్లోకి అనుమతించాలన్నారు. గుర్తింపు కార్డులను పరిశీలించడంతోపాటు మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు లేవని నిర్ధారించుకున్న తర్వాతే వారికి నిర్దేశిత మార్గం వద్ద డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్ ద్వారా తనిఖీ చేసి కౌంటింగ్ కేంద్రంలోనికి అనుమతించాలన్నారు. నిరంతరం కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి మానిటరింగ్ చేస్తామని, ఇబ్బందులు ఎదురైతే వెంటనే పై అధికారులకు సమాచారం అందించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, అదనపు ఎస్పీ మాసుమ్ బాష, జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ఎం.సత్యనారాయణ, రైల్వే డీఎస్పీ నాగేశ్వరరావు, సెబ్ డీఎస్పీ వెంకట నారాయణ, దిశా డీఎస్పీ మున్న మురళీకృష్ణ, ట్రైనీ డీఎస్పీ అరవింద్ పాల్గొన్నారు.




భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, జిల్లా ఎస్పీ అజిత

28 రోజులు.. రూ.3.15 కోట్లు

చినవెంకన్న హుండీ ఆదాయం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి (చినవెంకన్న) ఆలయ హుండీల ఆదాయాన్ని సోమవారం స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో లెక్కించారు. స్వామివారికి భారీగా ఆదాయం సమకూరింది. గత 28 రోజులకు గాను నగదు రూపేణా రూ.3,15,85,574ల ఆదాయం లభించినట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. అలాగే కానుకల రూపేణా భక్తులు సమర్పించిన 234 గ్రాముల బంగారం, 7.650 కేజీల వెండితో పాటు అధికంగా విదేశీ కరెన్సీ లభించిందన్నారు. లెక్కింపులోకి రాని రద్దయిన పాత రూ.2,000, రూ.1,000, రూ.500ల నోట్ల ద్వారా రూ.41,500లు లభించిందన్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

న్యూస్‌రీల్

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం



ప్రశంసాపత్రం అందుకుంటున్న కవి హేమంత్

పాలకొల్లు అర్బన్: తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ కోసం ఆదివారం రాత్రి నిర్వహించిన నిర్విరామ సకల కళా ప్రదర్శనలో పాలకొల్లుకి చెందిన కవి డీటీ హేమంత్ పేరు నమోదు చేసుకున్నారు. విజయవాడ హనుమంతరాయ గ్రంథాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో హేమంత్ కవిత చెప్పారు. సంస్థ అధ్యక్షుడు మాడుగుల రత్నకుమారి, ప్రధాన కార్యదర్శి యూవీ రత్నం, కోశాధికారి కంభంపాటి ప్రభుదాసు, ఏపీ సచివాలయ ఓఎస్‌డీ ప్రభాకర్, రచయిత్రి సరికొండ రమాదేవి చేతులమీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు 10 వరకు గడువు

ఉండి: జిల్లాలోని రెండు ప్రభుత్వ, 16 ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాలకు ఈనెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే అవకాశం ఉందని ఐటీఐ జిల్లా కన్వీనర్ వి.శ్రీనివాసరాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుని సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలు (ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం, ఆచంట)లో ఒరిజినల్ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకుని తప్పనిసరిగా రసీదు పొందాలన్నారు. వీరు మాత్రమే కౌన్సెలింగ్‌కు అర్హత సాధిస్తారన్నారు. అలాగే పదో తరగతి ఫెయిల్ అయిన వారికి వెల్డర్ వన్ ఇయర్ కోర్సులో చేరేందుకు అవకాశం ఉందని తెలిపారు.

'ఓపెన్' పరీక్షలకు 313 మంది హాజరు

భీమవరం: జిల్లాలో ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖాధికారి జి.నాగమణి తెలిపారు. జిల్లావ్యాప్తంగా 345 మంది విద్యార్థులకు 313 మంది హాజరయ్యారన్నారు. ఐదు పరీక్షా కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ చేయగా ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఆమె తెలిపారు.

ఏలూరు జిల్లాలో..

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ఆధ్వర్యంలో దూరవిద్యావిధానంలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియెట్ కోర్సులకు సంబంధించిన సోమవారం జరిగిన సప్లిమెంటరీ పరీక్షలకు 248 మంది హాజరయ్యారు. జీవశాస్త్రం పరీక్షకు 108 మందికి 100 మంది, వాణిజ్య/వ్యాపార శాస్త్రం పరీక్షకు 159 మందికి 148 మంది హాజరయ్యారు. జిల్లా పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, డీఈసీ కమిటీ కలిపి మొత్తం 7 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశాయి. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడా ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు.

బస్ పాస్‌ల జారీకి విరామం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆర్టీసీ ఏలూరు డిపో పరిధిలో సీజన్ పాసులు, విద్యార్థులకు అందించే పాసుల జారీకి సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేస్తున్న కారణంగా రెండు రోజులపాటు విరామం ఉంటుందని డిపో మేనేజర్ బి.వాణి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఈ నెల 6,7 తేదీల్లో సీజన్ పాసులు, విద్యార్థుల పాసులు జారీ చేయమన్నారు. ఈ సౌకర్యాన్ని 8వ తేదీ నుంచి పునరుద్ధరిస్తామని వివరించారు.

రెండు రైళ్ల రద్దు

ఏలూరు (టూటౌన్): దక్షిణ మధ్య రైల్వే గుంటూరు, విజయవాడ డివిజన్‌ల పరిధిలో పలు రైళ్లను రద్దు చేయడంతో పాటు కొన్ని రైళ్లను దారి మళ్లించారు. రద్దీ నియంత్రణలో భాగంగా ఈ చర్యలను తీసుకున్నట్లు రైల్వే అధికారులు ప్రకటనలో తెలిపారు. రాజమండ్రి-విజయవాడ 07767 నంబర్, విజయవాడ-రాజమండ్రి 07459 నంబర్ రైళ్లను నెలాఖరు వరకు రద్దు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పీఆర్వో నస్రత్ ఎం.మండ్రుపకర్ పేర్కొన్నారు.

5న పర్యావరణ పరిరక్షణపై పోటీలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈనెల 5న పర్యావరణ సంరక్షణ అనే అంశంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించాలని ఏలూరు డీఈఓ ఎస్.అబ్రహం పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. మండల స్థాయిలో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకూ చదివే విద్యార్థులకు వ్యాసరచన, పర్యావరణ సంరక్షణ తెలిపే వివిధ పద్ధతులపై పోస్టర్ ప్రజెంటేషన్, పర్యావరణ పరిరక్షణలో చెట్ల ప్రాముఖ్యత అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. విజేతలు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

క్లుప్తంగా

గన్నవరం వెళ్లి పింఛన్ అందజేత



గన్నవరం ఆస్పత్రిలో పింఛన్ అందించిన వట్లూరు పంచాయతీ కార్యదర్శి

పెదపాడు: వట్లూరుకు చెందిన ఆత్కూరి అఖిల్ గన్నవరంలోని పిన్నమనేని సిద్ధార్థ ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకుంటూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో వట్లూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి మేకా శ్రీనివాస్ వెల్ఫేర్ అసిస్టెంట్‌తో కలిసి వెళ్లి ఆసుపత్రిలో డయాలసిస్ పింఛన్ అందించారు.

అభయాంజనేయస్వామి హుండీ ఆదాయం లెక్కింపు



పెదపాడు మండలంలోని అభయాంజనేయ స్వామి హుండీ లెక్కిస్తున్న భక్తులు

పెదపాడు: అప్పనవీడులోని అభయాంజనేయ స్వామి ఆలయంలో స్వామివారి హుండీ ఆదాయం రూ.15,76,760 వచ్చినట్లు ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. పెదపాడు మండలంలోని అప్పనవీడులో సోమవారం ఉదయం అభయాంజనేయ స్వామి హుండీ ఆదాయం లెక్కించారు. 71 రోజులకు లెక్కింపులో ఈ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కౌంటింగ్ పర్యవేక్షణ అధికారి ఆగిరిపల్లి గ్రూపు ఆఫ్ టెంపుల్స్ ఈఓ డీ సురేష్ బాబు పాల్గొన్నారు.

భవిష్యత్తు త్రీడీ ప్రింటింగ్‌దే



మాట్లాడుతున్న నిట్ రిజిస్ట్రార్ పి.దినేష్ శంకర్ రెడ్డి

తాడేపల్లిగూడెం: భవిష్యత్తు త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ రంగానిదేనని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి అన్నారు. సంస్థలోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీపై 8, 9, 10 తరగతి విద్యార్థులకు ఐదు రోజుల పాటు నిర్వహించనున్న ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం దినేష్ శంకరరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత వేగంగా విస్తరిస్తున్న రంగం త్రీడీ రంగమన్నారు. వివిధ రకాల నాణ్యమైన వస్తువులు, బొమ్మలు, భవనాలు, వంతెనలు, నచ్చిన డిజైన్లలో ఎంతో అందంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దుకోవచ్చని చెప్పారు. నైపుణ్యాలు పెంచుకోవాలని, అంకుర పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలన్నారు. పాఠశాల స్థాయి నుంచి సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ కోర్సులలో పట్టు సాధించాలని సూచించారు. డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ జీవీ వీరేష్ కుమార్, ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ టి.బాబూరావు, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ టి.కార్తికేయశర్మ పాల్గొన్నారు.

కొల్లేరు చిత్తడి భూములకు ముప్పు

- కొల్లేరు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు
- స్వీప్ ఆధ్వర్యంలో మొక్కలు నాటేలా ప్రణాళిక
- రేపు ప్రపంచ పర్యావరణ దినోత్సవం





కాలుష్యం కారణంగా ఉనికిని కోల్పోతున్న కొల్లేరు సరస్సు



కైకలూరులో స్వీప్ ఆధ్వర్యంలో పర్యావరణ ర్యాలీ (ఫైల్)

కైకలూరు: వాతావరణ మార్పులు, కాలుష్యం, అడవుల పరిరక్షణ, జీవవైవిధ్యంపై ప్రజలను చైతన్య పరిచేలా ఏటా జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 'భూ పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువు పరిస్థితులు' నినాదంతో ప్రపంచ వ్యాప్తంగా ఈ కార్యక్రమం చేపట్టారు. యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రాం(యుఎన్ఈపీ) ఆధ్వర్యంలో సౌదీ అరేబియా పర్యావరణ ప్రపంచ వేడుకలకు ప్రధానకర్తగా వ్యవహరిస్తోంది. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పలు స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ ప్రేమికులు వివిధ రూపాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఆందోళన కలిగిస్తున్న కొల్లేరు పర్యావరణం

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో కొల్లేరు సరస్సు 77,138 ఎకరాల్లో విస్తరించింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏకైక చిత్తడి నేలల ప్రాంతం కొల్లేరు మాత్రమే. ఈ సరస్సులో ఏటా 17 వేల టన్నుల వ్యర్థాలు కలుస్తాయని జియోగ్రాఫికల్ రిసర్చ్ సర్వే అంచనా. పొలాలు, ఆక్వా చెరువుల నుంచి వచ్చే ఎరువులు, పురుగుమందులతో సహా మిల్క్, సుగర్ ఫ్యాక్టరీలు, రైస్, పేపరు మిల్లులు ఇలా వివిధ రకాల కర్మాగారాల నుంచి విష జలాలు కొల్లేరుకు చేరుతున్నాయి. సాధారణంగా నదులు, కాల్వల్లో ఖనిజ లవణాలు 200–330 పీపీఎం(పార్ట్స్ పర్ మిలియన్)గా ఉండాలి. కొల్లేరులో మాత్రం ఏకంగా 22 వేల పీపీఎంలు నమోదయ్యాయి. ఈ కారణంగా కొల్లేరులో పెరిగే సహజసిద్ధ చేప జాతులు అంతరిస్తున్నాయి. కొల్లేరులో చేరే నీటిని ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ద్వారా శుద్ధి చేసి విడుదల చేయాలని పర్యావరణ వేత్తలు కోరుతున్నారు.

అవగాహన కలిగిస్తున్న 'స్వీప్'

పర్యావరణంపై అవగాహన కలిగించి ప్రజలను చైతన్యవంతుల్ని చేయడానికి 2018లో కైకలూరులో న్యాయవాది పి.పవన్‌కాంత్ 'స్వీప్' సంస్థను స్థాపించారు. పర్యావరణ ప్రేమికులతో వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేసి పర్యావరణ అవగాహన కార్యక్రమాలు చేస్తున్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వ్యతిరేకిస్తూ మౌనపోరాటం చేశారు. దీంతో ఒక్క రోజులో కైకలూరులో రూ.2.50 లక్షల విలువ చేసే ప్లాస్టిక్‌ను సీజ్ చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



భారతదేశంలో 75 శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. పర్యావరణ ప్రభావం జీవన స్థితిగతులపై పడుతుంది. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదుకు ఇదే కారణం. విద్యార్థి దశ నుంచి పర్యావరణంపై విద్యాలయాలు అవగాహన కలిగిస్తున్నాయి. భావితరాల భవిష్యత్తు బాగుండాలంటే పర్యావరణాన్ని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలి.

– డాక్టర్ ఎం.హరిప్రసాద్, అధ్యాపకుడు, వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, కైకలూరు

ప్రతి ఒక్కరూ చెట్లను నాటాలి



స్వీప్ ద్వారా వాట్సప్ గ్రూపులో పర్యావరణ అవగాహన సభ్యులకు చక్కటి సందేశం అందించాం. పర్యావరణ దినోత్సవం రోజున వృక్షజాతులైన వేప, నేరేడు, చింత వంటి మొక్కలను ప్రతి సభ్యుడు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని నిర్ణయించాం. పర్యావరణ అనుకూల జీవనశైలి పద్ధతులను అధ్యయనం చేయడానికి కేంద్ర ప్రభుత్వ ×ఎకో మిత్రమ్ యాప్×ను వినియోగిస్తున్నాం.

– పి.పవన్‌కాంత్, స్వీప్ వ్యవస్థాపకుడు, న్యాయవాది, కైకలూరు

నాటిక పోటీల్లో విజేతగా 'ఇంద్రప్రస్థం'



నాటిక పోటీల్లో ప్రథమ బహుమతి అందుకుంటున్న ఇంద్రప్రస్థ నాటిక కళాకారులు

భీమవరం: చైతన్య భారతి సంగీత, నృత్య, నాటక పరిషత్ 17వ జాతీయస్థాయి నాటికల పోటీల్లో గుంటూరు అభినయ ఆర్ట్స్ ఇంద్రప్రస్థం ఉత్తమ ప్రదర్శనగా ఎంపికై ంది. భీమవరం డీఎన్నార్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో నాలుగు రోజులుపాటు నిర్వహించిన జాతీయస్థాయి నాటిక పోటీల్లో 9 నాటికలను ప్రదర్శించారు. ద్వితీయ బహుమతిని విశాఖపట్నం తెలుగు కళా సమితి ప్రదర్శించిన నిశ్శబ్దమా నీ ఖరీదెంత, తృతీయ బహుమతిని కరీంనగర్ చైతన్య కళాభారతి స్వప్నం రాల్చిన అమృతం నాటిక గెల్చుకున్నట్లు న్యాయనిర్ణేతలు ప్రకటించారు. జ్యూరీ ప్రదర్శనగా కళాంజలి హైదారాబాద్ వారి రైతే రాజు, ఉత్తమ రచనకు మూల్యం రచయిత సింహ ప్రసాద్, ఉత్తమ దర్శకత్వం ఎన్ రవీంద్ర రెడ్డి, ఉత్తమ నటుడిగా సి.వరప్రసాద్, ఉత్తమ నటిగా నాగరాణి ఎన్నికయ్యారు. విజేతలకు చైతన్య భారతి అధ్యక్షుడు రాయప్రోలు భగవాన్, రాయప్రోలు శ్రీనివాసమూర్తి, కట్రెడ్డి సత్యనారాయణ, భట్టిప్రోలు శ్రీనివాసరావు, బొండా రాంబాబు, పేరిచర్ల లక్ష్మణవర్మ, కాగిత వెంకటరమణ, భీశెట్టి జ్యోతిరాజ్, పెన్నాడ శ్రీను, నడింపల్లి మహేష్, వడుపు గోపి, కేవీ రమణమూర్తి తదితరులు బహుమతులు అందచేశారు.

నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణం



శ్రీవారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణ అలంకరణలో స్వామి, అమ్మవార్లు

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో జరుగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉపాలయంలో కొలువై ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, పండితులు శ్రీవారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామి కల్యాణాన్ని వీక్షించారు. గర్భగుడిలో కొలువై ఉన్న మద్ది అంజన్నకు ప్రభాత సేవ, నిత్య అర్చన, నిత్యహోమాలు, బలిహరణ వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ఈవో ఆకుల కొండలరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉత్సవాల్లో నేడు

మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఈవో తెలిపారు. మహాపూర్ణాహుతి, దీక్షా విరమణ, స్వామికి అభిషేకాలు, ధ్వజారోహణ, చక్రస్నానం, రాత్రి 7 గంటలకు పుష్కరిణిలో స్వామి తెప్పోత్సవం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

ఫలితాలపై జోరుగా బెట్టింగులు

గెలుపుపై ఎవరికి వారే ధీమా

ఏలూరు (టూటౌన్): సార్వత్రిక ఎన్నికల ఫలితాలు నేడు వెలువడుతున్న నేపథ్యంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. రాష్ట్రంలో ఎన్నికలు జరిగిన 21 రోజుల అనంతరం ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఇప్పటికే గెలుపోటములపై జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున బెట్టింగులు జరిగాయి. గత ఐదేళ్ల పాలనలో ఇచ్చిన హామీలను వంద శాతం నెరవేర్చిన వైఎస్ జగన్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో సానుకూలత స్పష్టంగా కన్పించింది. గ్రామీణ ప్రాంతాల్లో పెరిగిన ఓటింగ్ శాతం కూడా వైఎస్సార్‌సీపీ గెలుపు అవకాశాలు మెరుగుపరిచాయని వివిధ సర్వేలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో రెండోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపడతారనే విశ్వాసాన్ని వైఎస్సార్‌సీపీ శ్రేణులు వ్యక్తం చేస్తున్నాయి.

భారీగా బెట్టింగ్‌లు

ప్రస్తుత ఎన్నికల ఫలితంపై బెట్టింగ్‌లు ఇండియా-పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్ తరహాలో సాగుతున్నాయి. ఎన్నికలకు ముందే సమ స్థాయిలో పందేలు కాశారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత కోసు పందేలకు సిద్ధమయ్యారు. రూ.1-రూ.1.25, రూ.1-రూ.1.50, ప్రస్తుతం రూ.1కి-రూ.2 చొప్పున పందేలు కాస్తున్నారు. రాష్ట్రంలో ఎవరు అధికారం చేపడతారనే దానిపై రూ.1కి-రూ.2.50 చొప్పున బెట్టింగ్‌లు కడుతున్నారు. ఎన్నికల తర్వాత కూటమి తరపున బెట్టింగ్‌లకు నాయకులు పెద్ద సంఖ్యలో పందేలకు కవ్వించారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఎగ్జిట్ పోల్ ఫలితాలు వెల్లడించిన తర్వాత బెట్టింగ్ జోరును పెంచారు.

దెందులూరుపై కోట్లలో పందాలు

దెందులూరు నియోజకవర్గంలో ఇరుపార్టీల గెలుపు ఓటములపై కోట్లలో పందేలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని ఏ గ్రామంలో చూసినా పందేలపై చర్చ కొనసాగుతుంది. జిల్లాలో దెందులూరు సీటు ఫలితంపై బెట్టింగులు భారీగా జరుగుతున్నాయి.

పులివెందుల మెజార్టీపైనా పందేలు

పులివెందులలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గత ఎన్నికల్లో సాధించిన 90,234 ఓట్ల మెజార్టీ కంటే ఎక్కువ వస్తుందని వైఎస్సార్‌సీపీ నేతలు పందేలు కాస్తున్నారు. కుప్పంలో చంద్రబాబు మెజార్టీపైనా, పిఠాపురంలో పవన్ కల్యాణ్ మెజార్టీపైనా పందేలు కాస్తున్నారు.

మీడియా కేంద్రాల్లో వసతులు కరువు



భీమవరం విష్ణు కళాశాల వద్ద ఏర్పాటుచేసిన మీడియా సెంటర్

భీమవరం: కౌంటింగ్ వేళ మీడియాకు ఇబ్బందులు తప్పేలా లేవు. భీమవరం పట్టణంలోని ఎస్ఆర్‌కేఆర్, విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలోనే ఏడు అసెంబ్లీ నియోజవర్గాలు, పార్లమెంట్ ఓట్లు లెక్కింపు జరగనుంది. ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం నియోజకవర్గాలు, విష్ణు కళాశాలలో ఆచంట, పాలకొల్లు, నరసాపురం, తణుకు నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్లు లెక్కింపునకు పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. ఓట్ల లెక్కింపు కౌటింగ్ కేంద్రాలకు కొంతమంది విలేకర్లకు మాత్రమే అవకాశం కల్పించారు. విలేకర్ల కోసం ప్రత్యేకంగా మీడియా సెంటర్లను ఏర్పాటుచేశారు. భీమవరం మీడియా సెంటర్‌లో విలేకర్లకు కనీస సదుపాయాలు కల్పించలేదు. కుర్చీలు, చిన్నచిన్న స్క్రీన్‌లు మాత్రమే వేసి చేతులు దులుపుకున్నారు.

పారిజాతగిరిలో ముగిసిన బ్రహ్మోత్సవాలు





వెంకటేశ్వరస్వామి మూలమూర్తికి చతుర్దశ కలశస్నపనం నిర్వహిస్తున్న దృశ్యం, ద్వాదశ ప్రదక్షిణలు చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం నిర్వహించిన శ్రీ కృపయాగ మహోత్సవంతో వైభవంగా ముగిసినట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు. సోమవారం ఆలయంలో ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో చతుర్దశ కలశ స్నపనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయ కళ్యాణ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడి ఉత్సవమూర్తులకు ద్వాదశ ఆరాధన, ద్వాదశ నివేదనలు, నిర్వహించారు. అనంతరం భక్తుల గోవింద నామస్మరణలతో మంగళ వాయిద్యములతో స్వామి ఉత్సవమూర్తులకు ఆలయం చుట్టూ 12 ప్రదక్షిణలతో ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవమూర్తులను కళ్యాణ మండపంలో వేదికపై వేంజేపజేసి వివిధ రకాల పుష్పాలతో వైభవంగా శ్రీపుష్పయాగం నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వరసా సంతోష్

కుక్కునూరు/వేలేరుపాడు: రోడ్డు ప్రమాదంలో మండలానికి చెందిన ఓ యువకుడు మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వేలేరుపాడు మండలంలోని కోయమాదారం గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. నెమలిపేట గ్రామానికి చెందిన వరసా సంతోష్ (19), కంగాల రాము, కంటిపల్లి ప్రవీణ్‌లు ద్విచక్ర వాహనంపై రౌతుగూడెంలోని బంధువుల ఇంటికి పెళ్లికి వెళుతుండగా, కోయమాదారం వద్ద అశ్వారావుపేట నుంచి కుక్కునూరు వైపు వస్తున్న యూనియన్ బ్యాంక్ క్యాష్ వ్యాన్ తప్పించే క్రమంలో వ్యాన్‌ను ఢీకొట్టారు. సంతోష్ తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రవీణ్, రాములు తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

క్వారీ చెరువులో పడ్డ వ్యాన్



అంబర్‌పేట క్వారీలో పడ్డ కోళ్ల వ్యర్థాల వ్యాన్

భీమడోలు: గ్రావెల్ క్వారీ చెరువులో కోళ్ల వ్యర్థాల వ్యాన్ సోమవారం అదుపు తప్పి పడింది. వ్యాన్ డ్రైవర్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. అంబర్‌పేట క్వారీ వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. దెందులూరు పోలీసులు లారీని పట్టుకుని వ్యర్థాలను ధ్వంసం చేసేందుకు లారీని ఆ ప్రాంతానికి తీసుకుని రాగా ప్రమాదం జరిగినట్లు రెవెన్యూ సిబ్బంది చెబుతున్నారు. స్థానికులు మాత్రం చెరువులో కోళ్ల వ్యర్థాలు డంప్ చేస్తుండగా అదుపు తప్పి పడిపోయినట్లు చెబుతున్నారు. క్వారీలో గ్రావెల్ తవ్వకాల తర్వాత ఏర్పడిన గోతుల్లో నీరు ఉంచి ఆక్వా సాగు చేస్తున్నారు. వాటిలోకి కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్నారు.

సందడిగా ఏలూరు

- ఏలూరు చేరుకున్న అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు
- నగరంలోని లాడ్జీలన్నీ ఫుల్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కొద్ది గంటల్లో మూడు వారాల నిరీక్షణకు తెరపడనుంది. గత నెల 13న ఏలూరు పార్లమెంట్ స్థానంతో పాటు, ఏలూరు జిల్లాలోని 7 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ఓట్ల లెక్కింపు కోసం ఏలూరులోని సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. లెక్కింపు నేపథ్యంలో సోమవారం ఉదయం నుంచే ఏలూరు నగరం సందడిగా మారింది. ఆయా నియోజకవర్గాల నుంచి పోటీ చేసిన అభ్యర్థులు, వారి తరఫున కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనబోయే ఏజెంట్లు నగరానికి చేరుకుంటున్నారు. సోమవారం రాత్రికి నగరంలో పండుగ వాతావరణం కనిపించింది. వీరి రాకతో నగరంలోని లాడ్జి రూములన్నీ నిండిపోయాయి. అభ్యర్థులు, వారి ఏజెంట్లు, కార్యకర్తలే కాకుండా ఆయా పార్టీలపై బెట్టింగులు కట్టిన వారు సైతం లెక్కింపు ప్రక్రియలోని రౌండురౌండుకూ ఫలితాలు తెలుసుకుని తమకు అనుకూలంగా ఉందా, ప్రతికూలంగా ఉందా అంచనా వేసుకోవడానికి నగరానికి చేరుకున్నారు. సాయంత్రం నుంచి నగరంలో హోటల్, చిరుతిళ్ల వ్యాపారాలు జోరందుకున్నాయి. మద్యం దొరకక మందుబాబులు నిరాశ పడగా, కొంతమంది ముందుగానే జాగ్రత్తపడి రెండు రోజుల ముందుగానే మద్యం బాటిళ్లు సేకరించుకోవడంతో లాడ్జిల్లో మందులో మునిగి తేలారు. రాత్రి 9 గంటలు దాటిన తరువాత నగరంలోని భోజన హోటళ్లు, బిర్యానీ పాయింట్లు కిటకిటలాడిపోయాయి.

ఏడు అసెంబ్లీ స్థానాలకు 86 మంది పోటీ

జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు ప్రధాన పార్టీల అభ్యర్థులు, చిన్న పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు కలిపి మొత్తం 86 మంది పోటీ చేశారు. అత్యధికంగా కైకలూరు, దెందులూరు స్థానాలకు 15 మంది చొప్పున పోటీ చేయగా చింతలపూడి నుంచి అత్యల్పంగా 8 మంది పోటీ చేశారు. ఉంగుటూరు నుంచి 12 మంది, ఏలూరు నుంచి 14, పోలవరం నుంచి 12, నూజివీడు నుంచి 10 మంది పోటీ చేశారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం నుంచి 13 మంది పోటీ చేశారు. ఓట్ల లెక్కింపుకు మొత్తంగా 1386 మంది ఏజంట్లు కౌంటింగ్ కేంద్రాల్లోకి వెళ్ళే అవకాశం ఉంది.

వందలాది కార్లతో పెరిగిన ట్రాఫిక్

ఓట్ల లెక్కింపు కోసం జిల్లా కేంద్రానికి ఆయా నియోజకవర్గాలకు చెందిన అభ్యర్థులు, వారి అనుయాయులు కార్లలో రావడంతో నగరంలో వందలాది కార్లు దర్శనమిస్తున్నాయి. లెక్కింపు పూర్తయిన తరువాత గెలిచిన అభ్యర్థులతో ర్యాలీగా వెళ్ళడానికి మంగళవారం నగరానికి మరిన్ని కార్లు వచ్చే అవకాశముంది. దీంతో నగరంలో ట్రాఫిక్ పెరిగింది. కౌంటింగ్ నిమిత్తం వివిధ నియోజకవర్గాల నుంచి వచ్చిన వ్యక్తుల కారణంగా వివిధ వ్యాపారాలు ఊపందుకున్నాయి. మంగళవారం రాత్రి వరకూ ఇదే పరిస్థితి కొనసాగుతుందని అంచనా.

దాహార్తి తీరుస్తున్న మజ్జిగ చలివేంద్రాలు



బల్లిపాడులో మజ్జిగ చలివేంద్రం

అత్తిలి: ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో వేసవిలో నిర్వహిస్తున్న మజ్జిగ చలివేంద్రాలు కొనసాగుతున్నాయి. అత్తిలి మండలంలో బల్లిపాడు, అత్తిలి గ్రామాలలో వీటిని నిర్వహిస్తున్నారు. బల్లిపాడు గ్రామాన్ని దత్తత తీసుకున్న డాక్టర్ దండు పద్మావతి మాట్లాడుతూ ట్రస్టు ద్వారా పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. అవధాని యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఎండ తీవ్రత తగ్గే వరకు చలివేంద్రాలు కొనసాగిస్తామని తెలిపారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

భీమడోలు: భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భీమడోలు పంచాయతీ శివారు చిన లింగంపాడుకు చెందిన గోగులమూడి అరుణ జ్యోతి(35)కి 15 ఏళ్ల కితం వివాహం కాగా ఒక అబ్బాయి ఉన్నాడు. భర్త రోజూ మద్యం తాగడంతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 2న భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. మనస్తాపానికి గురైన జ్యోతి సోమవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరి వేసుకుంది. వెంటనే భీమడోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది.

క్లుప్తంగా

పాఠశాలల బస్సులకు ఫిట్‌నెస్ టెస్ట్‌లు



ఫిట్‌నెస్ టెస్ట్ చేస్తున్న సురేంద్ర సింగ్ నాయక్

తాడేపల్లిగూడెం: పట్టణంలోని ఆర్టీవో కార్యాలయం వద్ద తాడేపల్లిగూడెం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ డి.సురేంద్ర సింగ్ నాయక్ ఆధ్వర్యంలో సోమవారం నియోజకవర్గ పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన బస్సులకు ఫిట్‌నెస్ టెస్ట్ డ్రైవ్ నిర్వహించారు. సురేంద్ర సింగ్ నాయక్ మాట్లాడుతూ నియోజకవర్గంలో మొత్తం 320 స్కూల్ బస్సులకు గాను 272 బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్ జారీ చేశామన్నారు. 48 బస్సులకు మరమ్మతులు చేయించాలని సూచించామని తెలిపారు. పూర్తి కండిషన్ లేకుండా స్కూల్ బస్సులు నడపడానికి వీలు లేదన్నారు. స్కూల్స్ తెరుస్తున్నందున మిగిలిన బస్సులు మరమ్మతులు చేసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందాలని సూచించారు.

మృతుని కుటుంబానికి రూ.5లక్షలు పరిహారం చెల్లించాలి



పెదతాడేపల్లి గ్రామంలో అలపాటి వెంకట్రావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న సోమరాజు

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధి హామీ పనిలో మృతి చెందిన వారికి రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పెద తాడేపల్లి గ్రామానికి చెందిన ఆలపాటి వెంకట్రావు ఉపాధి హామీ పనులు చేస్తూ మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన కుటుంబాన్ని సోమవారం సోమరాజు పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో ఈ ఏడాది ముగ్గురు మృతి చెందారని గుర్తు చేశారు. వారి కుటుంబాలకు కొత్తగా వచ్చే ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. తొలుత వెంకట్రావు మృతికి సోమరాజు ప్రగాఢ సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు తన సానుభూతి వ్యక్తం చేశారు.

6న అలంపురంలో ఉచిత వైద్యసేవలు

పెంటపాడు: మండలంలోని అలంపురం వెంకటరమణ సేవా ఛారిటీ ఆస్పత్రిలో ఈనెల 6న ఉదయం 10 గంటలకు పలువురు ప్రముఖ వైద్యులతో ఆరోగ్యసేవలు ఉచితంగా అందజేయనున్నట్లు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెద కృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. రాజమండ్రి రాజానగరంకు చెందిన జీఎస్ఎల్ ఆస్పత్రి వైద్యులు ఎముకలు, కీళ్లకు సంబంధించి చర్మవైద్యనిపుణులు, ఊపిరితిత్తుల నిపుణులు, చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు పరీక్షలు చేస్తారని ఆయన తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభించబోయే ఈ శిబిరాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వైద్యసేవలతో పాటు, గుండె వ్యాధికి సంబంధించి ఈసీజీ, 2డి ఈకో, అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలు కూడా ఉచితంగా చేస్తారన్నారు.

పింఛన్ల పంపిణీ పూర్తి



శేరేపాలెంలో వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న దృశ్యం

మొగల్తూరు: మండలంలోని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసేందుకు అధికారులు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకున్నారు. మొగల్తూరు మండలంలోని 17 గ్రామాల్లో 3,265 మందికి లబ్ధిదారులకు ఇంటి వద్దే పింఛన్లు ఇవ్వాల్సి ఉండగా 1వ తేదీ శనివారం సాయంత్రానికి సుమారు 1,725 మందికి, సోమవారం 1,540 మందికి పింఛన్లు అందించామని ఎంపీడీవో వి.బాబ్జిరాజు చెప్పారు. అలాగే 7,534 మంది లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాకు పింఛను సొమ్ము జమచేయాల్సి ఉండగా, సోమవారం నాటికి 7,525 మందికి ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు. బ్యాంక్‌ల ద్వారా ఏమైనా సమస్యలుంటే పింఛను వారి ఖాతాలో ఇప్పటికీ జమకాకుంటే వాటిని పరిష్కరించి పింఛను సొమ్ము వారి ఖాతాలో జమయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ

మొగల్తూరు: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడనున్న నేపథ్యంలో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. మండలంలోని పలువురు వ్యాపారులు, మధ్యతరగతి వారు కూడా ఫలనా పార్టీ గెలుస్తుందంటూ అంచనాలు వేస్తున్నారు. ఎగ్జిట్ పోల్ సర్వే ఫలితాలు వైఎస్సార్ సీపీకి అనుకూలంగా రావడంతో పందెం రాయుళ్లలో అలజడి నెలకొంది. మంగళవారం ఓట్ల లెక్కింపు వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భీమవరం వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులను భీమవరంలోని పోలింగ్ కేంద్రాలకు చేర్చేలా ఏర్పాట్లు చేసుకున్నారు.

తణుకులో లెక్కింపు ఇలా...

- నియోజకవర్గంలో 233 పోలింగ్ బూత్‌లు
- 17 రౌండ్లలో తేలనున్న తణుకు ఫలితం
- ఒక్కో రౌండ్‌లో 14 బూత్‌లు



భీమవరంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం

తణుకు: మే 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కీలక ఘట్టం ముగిసింది. ఓటర్లు గత ఎన్నికల కన్నా అధికంగా పోలింగ్‌లో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2019 నాటి కంటే 2024లో ఓటింగ్ శాతం పెరిగింది. నేతల తలరాతలను ఓటర్లు ఈవీఎంలలో భద్రపరిచారు. తణుకు నియోజకవర్గంలోని తణుకు అర్బన్‌తో పాటు తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల్లో మొత్తం 233 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. వాటిలో తణుకు అర్బన్‌లో 70, తణుకు మండలంలో 45, అత్తిలి మండలంలో 60, ఇరగవరం 58 చొప్పున మొత్తం 233 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. మొత్తం 14 టేబుళ్లు ఏర్పాటు చేసి 17 రౌండ్లలో పూర్తి తణుకు నియోజకవర్గంలోని 233 పోలింగ్ బూత్‌లకు గాను లెక్కింపు జరుగుతుంది. ఒక్కొక్క రౌండ్లో 14 బూత్‌లు చొప్పున లెక్కింపు చేయడం జరుగుతుంది. పోస్టల్ బ్యాలెట్లో 2356 ఓట్లు, సర్వీస్ ఓటర్లు కింద 102 మందికి ఇచ్చారు.

అత్తిలి మండలం నుంచి...

అత్తిలి మండలం తిరుపతిపురం గ్రామం నుంచి లెక్కింపు ప్రారంభించనున్నారు. తణుకు నియోజకవర్గంలోని 233 పోలింగ్ కేంద్రాలలో 17 రౌండ్లలో లెక్కింపు పూర్తి కానుంది. అత్యధికంగా 13వ రౌండ్లో అత్యధికంగా 13,539 ఓట్లు, రెండో స్థానంలో 2వ రౌండులో 12,828 ఓట్లు, అత్యల్పంగా 17వ రౌండ్‌లో 5,920 ఓట్లు లెక్కించనున్నారు. పోస్టల్ బ్యాలెట్, సర్వీస్ ఓట్లు లెక్కింపునకు మరో నాలుగు టేబుళ్లు ఏర్పాటు చేశారు. తణుకు నియోజకవర్గంలో 2,34,575 మంది ఓటర్లు ఉండగా వీరిలో 1,92,564 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. చివరగా ఇరగవరం మండలం ఏలేటిపాడు, జి.ఖండ్రిక పోలింగ్ కేంద్రంతో ముగియనుంది.

తుది ఫలితం తేలేది 15 రౌండ్ల తర్వాతే

తాడేపల్లిగూడెం: నియోజకవర్గం ఓటింగ్ తుది ఫలితం 15 రౌండ్ల తర్వాత తేలనుంది. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో గూడెం నియోజకవర్గ ఓటింగ్ ప్రక్రియకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుల్స్ ఏర్పాటు చేశారు. మొత్తం 15 రౌండ్లతో ఎన్నికల తుదిఫలితం వెలువడనుంది. కౌంటింగ్ ప్రక్రియతో పాటు పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల కౌంటింగ్ ఒకే సారి జరుగనుంది.పోలింగ్ బూత్‌ల సంఖ్య ఆధారంగా కౌంటింగ్‌ను ప్రారంభిస్తారు. నియోజకవర్గానికి సంబంధించి తాడేపల్లిగూడెం మండలం బంగారుగూడెం గ్రామం నుంచి మొదలవుతుంది. పోలింగ్ స్టేషన్ ఒకటి నుంచి 71 వరకు, 134,135,145,146 పోలింగ్ కేంద్రం లెక్కించేసరికి గూడెం రూరల్ మండలం కౌంటింగ్ మొత్తం పూర్తి కానుంది. పోలింగ్ కేంద్రం 72 నుంచి 76 వరకు, పోలింగ్ స్టేషన్ 155 నుంచి 209 వరకు పోలింగ్ కేంద్రాలు కౌంటింగ్ ముగింపుతో పెంటపాడు మండల ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది.పోలింగ్ బూత్ 77 నుంచి 154 బూత్ వరకు తాడేపల్లిగూడెం పట్టణ ఓటర్ల కౌంటింగ్ ప్రారంభమవుతుంది. 154వ బూత్ కౌంటింగ్ ముగిసేసరికి పట్టణం ఓటింగ్ కౌంటింగ్ పూర్తవుతుంది. మొత్తం 209 పోలింగ్ కేంద్రాల్లో కౌంటింగ్ పూర్తయ్యేసరికి ఫలితం వెలువడనుంది.



గూడెం నియోజకవర్గ ముఖచిత్రం

నియోజకవర్గం మొత్తం ఓటర్లు	– 214985
పోలైన ఓట్లు	– 175990
పురుషులు	– 87208
మహిళలు	– 88773
ఇతరులు	– 09
గూడెం మండలంలో పోలింగ్	– 60912
పెంటపాడు మండలంలో పోలింగ్	– 49143
గూడెం పట్టణంలో పోలింగ్	– 65935
ఈ ఓట్లలో ...	
పోస్టల్ బ్యాలెట్లు	– 1912
హోం ఓటర్లు	– 150
సర్వీసు ఓటర్లు	– 137

దివ్యాంగుల పిల్లలను గుర్తించండి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రావణి

తాడేపల్లిగూడెం (టీఓసీ): బడిబయట ఉన్న దివ్యాంగుల పిల్లలను గుర్తించాలని డాక్టర్ శ్రావణి అన్నారు. పట్టణంలోని వీకర్స్‌కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్‌లో అంగన్‌వాడీ టీచర్లుకు, ఆశా వర్కర్లుకు, ఏఎన్ఎంలకు ఎన్రోల్మెంట్ డ్రైవ్‌లో భాగంగా సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దుర్గ భవానీ, హెల్త్ సూపర్‌వైజర్ మంగలు మాట్లాడుతూ వైకల్యాల సమస్యలతో బాధపడుతున్నవారిని ఆదరించడం సమాజంలో ప్రతి ఒక్కరి బాధ్యతని చెప్పారు. ప్రత్యేక ఉపాధ్యాయులు బాలీశ్వరయ్య మాట్లాడుతూ దివ్యాంగులలో 21 రకాల వైకల్యాలు, ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమాలు, కల్పించే సదుపాయాలు, వైకల్యాలను తెలిపే వివిధ అంశాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయిని ఎం.చంద్రకుమారి, అంగన్‌వాడీ టీచర్స్, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

చల్లని వాతావరణంలో వేసవి విజ్ఞానం



వేసవి శిక్షణ శిబిరంలో ఆటలు ఆడుతున్న విద్యార్థులు



అత్తిలి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులచే పుస్తక సమీక్ష చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యార్థినీ, విద్యార్థులు చక్కని చదువులతో పాటు ఆటలలోను రాణించాలని పలువురు విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగులు పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం గ్రేడ్ –1 శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణ శిబిరం గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావుచే నిర్వహించారు. ఎస్.సత్యం, ప్రత్తి వీరాస్వామి, వి.రామాంజనేయులు, గరికపాటి బాపయ్య శర్మ, పాండు ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీషు, జనరల్ నాలెడ్జ్, లెక్కలలో టిప్స్, పొడుపుకథలు, ఇస్రో రాకెట్లు ప్రయాగం, తదితర విషయాలను నేర్పించారు. యోగా క్లాసులు, ఆధ్యాత్మిక విషయాలు, ఆటపాటలు జరిగాయి.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

అత్తిలి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా అత్తిలి శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులచే పుస్తక పఠనం, నీతి కథలు చెప్పడం, పుస్తక సమీక్ష నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో స్కిప్పింగ్, కేరమ్స్, క్విజ్ పోటీలు జరిపి విజేతలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి కృష్ణారావు, గ్రామీణ గ్రంథపాలకులు ఆర్ దానకృష్ణ, కిశోర్ బాబు, ఎం శ్రీదేవి, బి మహాలక్ష్మి, రిటైర్డ్ లైబ్రేరియన్ గంధం శేషవేంద్రరావు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దు

- తణుకులో డ్రోన్ కెమెరాలతో నిరంతర నిఘా
- తణుకు పట్టణ సీఐ ఎం.నాగరాజు



తణుకులో డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తున్న సీఐ నాగరాజు

తణుకు: జూన్ 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ పురస్కరించుకుని తణుకు సర్కిల్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు తీసుకుంటామని తణుకు పట్టణ సీఐ ఎం.నాగరాజు హెచ్చరించారు. సోమవారం తణుకు నరేంద్ర సెంటర్‌లో డ్రోన్ కెమెరాలతో సీఐ నాగరాజు పర్యవేక్షించి అనంతరం మాట్లాడారు. తణుకు పట్టణంలో పటిష్ట పోలీసు బందోబస్తుతో పాటు అణువణువునా సీసీ కెమెరాలు, రెండు డ్రోన్ కెమెరాలతో నిరంతరం నిఘా ఉంచామన్నారు. తణుకు సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు, హింసాత్మక ఘటనలు చెలరేగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. సామాజిక మాధ్యమాల వేదికగా అవాస్తవాలను షేర్ చేసినా లేదా రెచ్చగొట్టే వ్యాఖ్యలను పోస్టు చేసినవారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఫలానా వారి తాలూకా అంటూ మోటారు సైకిళ్లపై నేమ్ ప్లేట్లు ప్రదర్శిస్తే సంబంధిత వాహనాలను సీజ్ చేయడంతో పాటు వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. పెట్రోలు బంకుల్లో విడిగా పెట్రోలు, డీజిల్ అమ్మరాదని ఇప్పటికే ముందస్తుగా నోటీసులు జారీ చేశామని, ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుని పెట్రోల్ బంకులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. మంగళవారం తణుకులోని హోటళ్లు, లాడ్జిలు, టీ దుకాణాలు మూసివేయాలని 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్ అమల్లో ఉన్నందున గుంపులుగా తిరగవద్దని సూచించారు. రౌడీషీటర్లు, అనుమానితులు, ఘర్షణలు రెచ్చగొట్టే వారిపై నిఘా ఉంచామన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదని సీఐ నాగరాజు హెచ్చరించారు.

పొగాకు ఉత్పత్తుల వాడకంతో అనర్థాలు

తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ



తణుకు ధూమపాన వ్యతిరేక దినం కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ వెలగల అరుణ

తణుకు అర్బన్: ధమపానంతో ప్రాణాపాయం పొంచి ఉందని తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ అన్నారు. ప్రపంచ ధూమపాన వ్యతిరేక దినం కార్యక్రమంలో భాగంగా గతనెల 31 నుంచి ఈనెల 21వ తేదీ వరకు నిర్వహించనున్న అవగాహన సదస్సు తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ అరుణ మాట్లాడుతూ ధూమపాన అలవాటుతో ఊపిరితిత్తుల వ్యవస్థ విచ్ఛిన్నమై తద్వారా క్యాన్సర్ బారిన పడుతున్న పరిస్థితి ఉందన్నారు. పొగాకు ఉత్పత్తుల ద్వారా ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది వివిధ క్యాన్సర్‌ల బారిన పడి చనిపోతున్నారని అన్నారు. పొగాకులో 4వేల రకాల రసాయనాలు ఉంటే వాటి ద్వారా 60 రకాల క్యాన్సర్‌లు ఉత్పన్నమవుతాయని, ముఖ్యంగా నోటి, కాలేయం, ఊపిరితిత్తులు, గుండె సంబంధిత, మగవారిలో నపుంసకత్వం, మహిళల్లో గర్భాశయ క్యాన్సర్‌లు వచ్చే అవకాశముందని పొగ తాగే వారికి ఉన్న ప్రమాదం పక్కనే ఉండి పీల్చిన వారికి కూడా అంతే ప్రమాదం పొంచి ఉంటుందని స్పష్టం చేశారు. ధూమపానానికి దూరంగా ఉండాలనే అవగాహనతో పాటు జాతీయ పొగాకు నియంత్రణ ద్వారా జిల్లాలోని తణుకు, తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆస్పత్రుల్లో పొగాకు వాడకాన్ని మాన్పించే కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయని అన్నారు. ఆయా సెంటర్‌లలో మానసిక వైద్యులతోపాటు ఇద్దరు సోషల్ వర్కర్స్ ప్రతినిధులు అందుబాటులో ఉంటారని అన్నారు. అనంతరం పొగాకు పరిశ్రమ జోక్యం నుంచి పిల్లలను రక్షించడం అనే నినాదంతో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి మానసిక వైద్యులు డాక్టర్ ఎల్.సాయిబాలాజీ, జనరల్ మెడిసిన్ డాక్టర్ కె.శారదప్రసన్న, దంత వైద్యులు డాక్టర్ గంగాధర్, ఐసీటీసీ, ఆస్పత్రి సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

గల్ఫ్ బాధితులకు సహాయం హర్షణీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): గల్ఫ్ బాధితులకు గట్టిం మాణిక్యాలరావు సహాయం అందజేయడం హర్షణీయమని పలువురు అన్నారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం చినవెల్లమిల్లి గ్రామానికి చెందిన యల్లవుల వీరమణి మలేషియాలో అనారోగ్యంతో మృతి చెందారు. అక్కడ యజమానులు నగదు చెల్లిస్తేనే మృతదేహాన్ని ఇండియాకు పంపుతామని చెప్పడంతో దిక్కుతోచని స్థితిలో ఆమె కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. మృతదేహాన్ని ఇండియాకు రప్పించాలని కోరుతూ గల్ఫ్ దేశాల్లో ఇబ్బందులు పడుచున్న వారికి సహాయం అందజేసే లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావుకు తాడేపల్లిగూడెంలో వారు వినతిపత్రం అందజేశారు. మాణిక్యాలరావు కృషి చేసి వీరమణి మృతదేహాన్ని ఇండియాకు రప్పించడంతో పాటు ఉచితంగా అంబులెన్స్ ఏర్పాటు చేశారు. మృతదేహాన్ని రప్పించినందుకు సోమవారం మాణిక్యాలరావును కలిసిన వీరమణి కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

తెలుగు సినీ సాహిత్యంలో బాలు చిరస్మరణీయుడు



ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం జయంతి వేడుకలలో పాల్గొన్న ఉపాధ్యాయులు

తణుకు టౌన్: తెలుగు సినీ సంగీతంలో ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం చెరగని ముద్ర వేశారని తెలుగు సాహితీ సామ్రాజ్యం సాహితీ సంస్థ అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు చెప్పారు. ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా తణుకులోని శశి ప్రైమరీ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న శశి విద్యాసంస్థ తణుకు కాంపస్ ఇన్‌చార్జి నిమ్మగడ్డ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ సినీ జగత్తులో పాట విశ్వరూపం ఎస్పీ బాలు అని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తెలుగు సినిమాలలో ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం పాడిన పాటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో కాంపస్ ఇన్‌చార్జి నిమ్మగడ్డ రాజేంద్రప్రసాద్, శాలివాహన సంక్షేమ సంఘం అధ్యక్షుడు బిరుదుగడ్డ చింతన్నలను ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం ఈర్పిన విజయప్రభావతి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పడాల సుజాత, అధ్యాపకులు చదలవాడ విజయ, శశి స్కూల్ ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం



వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: దోమల రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీహర్ష అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం గ్రామంలో దోమలు పెరగకుండా, కుట్టకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రధానంగా దోమలు నీరు నిల్వ ఉన్న మురికికుంటల్లో వృద్ధి చెందుతాయని, వీటి నివారణకు కిరోసిన్, మడ్డి ఆయిల్‌ను వేయాలన్నారు. అలాగే దోమలను లార్వా దశలోనే నివారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో సూర్యకాంతం, హెచ్‌వీ జ్యోతి, హెచ్ఎస్ లక్ష్మణ్, ఫార్మాసిస్ట్ రామారావు, హెల్త్ అసిస్టెంట్ రాధాకృష్ణ, శ్రీను, జి.రమేష్, రామకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీ నాగేశ్వరరావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల సమస్యలపై ఐక్యంగా పోరాడాలి



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

నరసాపురం: ప్రేమలు, పెళ్లిళ్ల పేరుతో యువతులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి డిమాండ్ చేశారు. పట్టణంలోని అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో గత మూడు రోజులుగా జరుగుతున్న ఐద్వా రాష్ట్రస్థాయి విజ్ఞాన శిక్షణా తరగతులు సోమవారంతో ముగిశాయి. ముగింపు సభలో రమాదేవి మాట్లాడుతూ కొత్తగా ఏర్పడే ప్రభుత్వాలు యువతులపై జరుగుతున్న దాడులను అరికట్టే కఠిన చట్టాలను అమల్లోకి తేవాలన్నారు. లైగింక వేధింపుల కేసుల్లో నిందితులకు వెంటనే శిక్షలు పడేలా చట్టాలు రూపొందించాలని డిమాండ్ చేశారు. మహిళలు సమస్యలపై సంఘటితంగా పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ, అధ్యక్షురాలు కేతా పద్మజ, ఎస్.ఉదయకుమారి, బి.శ్యామల తదితరులు పాల్గొన్నారు.

నేడే ఆఖరి ఘట్టం

- నరాలు తెగే ఉత్కంఠ
- ఇప్పటికే కౌంటింగ్‌కు సర్వం సిద్ధం
- చివరి క్షణంలో భారీగా బెట్టింగ్‌ల జోరు

తణుకు: తణుకు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ మరోసారి విజయం సాధించబోతోందని ఆ పార్టీ శ్రేణులు ఉత్సాహంగా ఉన్నారు. ఈ దఫా సార్వత్రిక ఎన్నికల్లో సంక్షేమం, అభివృద్ధి, ప్రజాభిమానాన్ని వైఎస్సార్ సీపీ నమ్ముకుంది. సార్వత్రిక ఎన్నికల ఆఖరి ఘట్టానికి చేరుకుంది. మంగళవారం కౌంటింగ్ ప్రక్రియ చేపట్టి సాయంత్రానికి తుది ఫలితం వెల్లడించనున్నారు. అయితే 2019 ఎన్నికల ఫలితాలే పునరావృతం అవుతాయని వైఎస్సార్ సీపీ ధీమా వ్యక్తం చేస్తుండగా, టీడీపీ ఊహల పల్లకిలో ఊగిసలాడుతోంది. గత ఎన్నికల కంటే ఈ దఫా ఎన్నికల్లో 2 శాతం పోలింగ్ పెరిగింది. ఈ దఫా పోలింగ్ సరళి, ఓటింగ్ శాతాన్ని బట్టి వైఎస్సార్ సీపీకి అనుకూలమనే ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో తణుకు నియోజకవర్గంలో బెట్టింగ్ రాయుళ్లు ఎమ్మెల్యే అభ్యర్థుల విజయం, ప్రభుత్వంపై భారీగా బెట్టింగ్‌లు కడుతున్నారు. దీంతో కౌంటింగ్ సమయం దగ్గర పడే కొద్దీ రాజకీయ పార్టీల్లోనే కాకుండా ఓటర్లలోనూ టెన్షన్‌తో పల్స్ రేటు పెరిగిపోతోంది.

గెలుపుపై అభ్యర్థుల ధీమా...

సార్వత్రిక ఎన్నికల్లో విజేత ఎవరు.. పరాజితులు ఎవరు... ఎవరికి ఎంత మెజార్టీ వస్తుంది.. యువత, మహిళలు, వృద్ధులు ఎవరికి పట్టం కట్టారో ఇటువంటి ప్రశ్నలకు మంగళవారం మధ్యాహ్నం 3 గంటలోపు పూర్తి స్పష్టత రానుంది. ప్రధాన పార్టీల అభ్యర్థి కారుమూరి నాగేశ్వరరావు మాత్రం అంచనాలు వేసుకుని గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ దఫా పోలింగ్ సరళి, పెరిగిన శాతం, ప్రధానంగా మహిళల ఉత్సాహంపై విశ్లేషణలతో బెట్టింగ్‌లు జోరందుకున్నాయి. ఎక్కడ చూసిన ఫలి తాలు ఎలా ఉంటాయనే చర్చ జరిగింది. ఓట్ల లెక్కింపు సమయం దగ్గర పడుతున్న కొద్దీ అందరిలో పొలిటికల్ ఫీవర్ తారాస్థాయికి చేరుకుంది. మరోవైపు తణుకు నియోజకవర్గానికి సంబంధించి భీమవరం విష్ణు కళాశాలలో కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభించనున్నారు.

ఘనంగా హనుమద్ జయంతి మహోత్సవాలు

పాలకోడేరు: హనుమజ్జయంతి మహోత్సవాలు సందర్భంగా పెన్నాడలోని భక్తాంజనేయ స్వామి దేవాలయంలో గత మూడు రోజులుగా పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. మంగళవారం తేనెతో అభిషేకాలు, లక్ష పత్రి పూజలు చేశారు. సుమారు 5 వేల మందికి అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.